ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జగిత్యాల జిల్లా వార్తలు

5★★

ఆదివారం 9 జూన్ 2024



మరమ్మతులకు నోచుకోని రహదారులు 8లో..

రక్షిత మంచినీటి పథకాలపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం 8లో..

బడి బస్సు భద్రమేనా?

- జిల్లాలో 462 స్కూల్ బస్సులు
- నిబంధనలకు విరుద్ధంగా తిరిగే బస్సులపై నిఘా
- దృష్టి సారించిన రవాణాశాఖ అధికారులు



జగిత్యాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్‌పై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా తనిఖీలు నిర్వహించడానికి ప్రణాళికలు చేస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడం ఎంత ముఖ్యమో భద్రంగా ఇంటికి చేరడం అంతే ప్రధానంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. పాఠశాలల యాజమాన్యాలు విధిగా విద్యార్థులకు భద్రతపై భరోసా కల్పించాలని సూచిస్తున్నారు. పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలని, వాహనాలు రహదారులపైకి వచ్చే లోపు ఫిట్‌నెస్ చేయించుకోకుంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. విద్యార్థులను తరలించడానికి వినియోగిస్తున్న పాఠశాల వాహనాల ఫిట్‌నెస్‌పై చాలా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని విమర్శలు ఉన్నాయి. విద్యాసంస్థల బస్సులకు ప్రతి సంవత్సరం ఫిట్‌నెస్ పరీక్షలు చేసుకోవాలని ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి.



పాఠశాల బస్సును తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు, పోలీసులు

జిల్లాలో పాఠశాల వాహనాలు

జిల్లా వ్యాప్తంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో రిజిస్టర్ అయిన బస్సులు 462 ఉన్నాయి. ఇందులో ఇప్పటి వరకు 302 వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకున్నారు. మరో 160 వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించలేదు. అయితే జిల్లాలో మరో 220 పాఠశాల వాహనాలు 15 సంవత్సరాల కాలపరిమితి పూర్తి చేసుకొని కాలం చెల్లి ఉండడంతో వాటికి ఫిట్‌నెస్ పరీక్షలు చేయడానికి అధికారులు నిరాకరిస్తున్నారు. ఒక్కో ఫిట్‌నెస్ పరీక్షకు సంవత్సరానికి ఒకసారి రూ. 5వేలు ఖర్చవుతుంది. ఇష్టారీతిన ఫీజులు వసూలు చేసే స్కూల్ యాజమాన్యాలు కేవలం ఫిట్‌నెస్ కోసం ఖర్చు చేయడానికి వెనుకాడుతున్నాయి.

జిల్లాలో 293 ప్రైవేటు పాఠశాలలు

జిల్లా వ్యాప్తంగా 293 వివిధ ప్రైవేటు పాఠశాలలున్నాయి. ఇందులో 15 ప్రాథమిక పాఠశాలలు, 149 ప్రాథమికోన్నత పాఠశాలలు, 129 ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిల్లో సుమారు 68,019 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. సుమారు 3,689 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. పిల్లలను పాఠశాలల నుంచి తీసుకువెళ్లి, తిరిగి ఇళ్లకు చేర్చేందుకు అవసరమైన అవసరమైన బస్సుల నిర్వహణలో యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదు.

తనిఖీలు చేస్తున్నా.. తప్పించుకుంటూ వినియోగం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు ఆర్టీఏ అధికారులు, పోలీసులు పాఠశాలల బస్సులను తనిఖీలు చేస్తున్నారు. అయితే ముందుగానే సమాచారం తెలుసుకుంటున్న పాఠశాల యాజమాన్యాలు తప్పించుకుంటూ వాహనాలను ఇతర మార్గాల్లో వినియోగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు బస్సులకు ఎటువంటి ఫిట్‌నెస్ లేకుండానే యధేచ్ఛగా రోడ్లపై తిప్పుతున్నారని పలువురు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు

వంశీధర్, జిల్లా రవాణా శాఖ అధికారి, జగిత్యాల



అనుమతులు లేకుండా పాఠశాల యజమానులు స్కూల్ బస్సులు నడిపితే చర్యలు తీసుకుంటాం. స్కూల్ యాజమాన్యాలు వారి వాహనాలకు ఫిట్‌నెస్ చేయించుకోవాలి. అనుభవం ఉన్న వారిని డ్రైవర్‌గా నియమించుకోవాలి. నిబంధనలు పాటించకుంటే కేసులు నమోదు చేస్తాం. పాఠశాలలు పునః ప్రారంభించి బస్సులను రహదారులపైకి తీసుకవచ్చేలోపు ఫిట్‌నెస్ తప్పని సరిగా చేయించుకోవాలి. ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించకుంటే యాజ మాన్యాలపై కేసులు నమోదు చేస్తాం.



కేసు నమోదు చేసి అపరాద రుసుము విధిస్తున్న అధికారులు

వాహనాలకు ఫిట్‌నెస్ పరీక్ష చేయించాలనుకుంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. పాఠశాలకు సంబంధించిన వివరాలు, సెల్ నంబర్, బస్సు మోడల్, డ్రైవర్ వివరాలు, అటెండర్, ఫొటోలు, బస్సు నడిచే మార్గం, సీట్ల పరిమితి తదితర విష యాల ను నమోదు చేయాలి. ప్రభు త్వ నిబంధనలకు అనుకూలంగా వాహనంలో మెడి

నిబంధనలు ఇలా :

కల్ కిట్లు, గాలి, వెలుతురు వచ్చేలా కిటికీలు, సీట్ల మధ్య రాడ్లు అమర్చి ఉండాలి. విద్యార్థులు బస్సులో ఎక్కేందుకు, దిగేందుకు అనుకూలంగా 325 మిల్లీమీటర్ల. ఎత్తు ఉండేలా బస్సు మెట్లు ఉండాలి. ఆపద సమయంలో బయటకు దిగేందుకు అత్యవసర ద్వారం తప్పకుండా ఏర్పాటు చేసి ఉండాలి. విద్యార్థులు బస్సు దిగేటప్పుడు, ఎక్కేటప్పుడు డ్రైవర్‌కు కనబడేలా రెండు వైపులా సైడ్ అద్దాలు, అన్ని కిటికీలను కలుపుతూ ఇనుప జాలి అమర్చి ఉండాలి. వాహనం టైర్లు, బ్రేకులు నాణ్యతతో ఉండేలా చూసుకోవాలి. బస్సుపై ఏ పాఠశాలకు చెందినదో తెలిపేలా పూర్తి వివరాలు రాసి ఉండాలి. పాఠశాల వాహనాలు నడిపే డ్రైవర్లకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలి. రాత్రి వేళల్లో బస్సులను గుర్తుపట్టేలా నాలుగు వైపులా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్సీ రమణ పరామర్శ

జగిత్యాల టౌన్, జూన్ 8: జగిత్యాల పట్టణానికి చెందిన ఒగ్గు కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు వొళ్లం కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్సీ రమణ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. సింగిల్ విండో చైర్మన్ సత్యనారాయణ రావు, నాయకులు వొళ్లం మల్లేశం, దయాల మాల్లారెడ్డి, వుల్ల మల్లయ్య, చెట్టి మల్లేవం, చెట్టి రమేష్, మొగుల్ల పోచమల్లు తదితరులు ఉన్నారు.

జేఎన్‌టీయూలో గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

కొడిమ్యాల, జూన్ 8: ఈ నెల 9న ఆదివారం నిర్వహిం చనున్న గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పరీక్షల చీఫ్ సూపరిండెంట్ సురేష్‌అర్జుల్లా శనివారం తెలిపారు. నాచుపల్లి జేఎన్‌టీయూలో 696 మంది అభ్య ర్థులు అలాట్ అయినట్లు ఆయన తెలిపారు. 15 గదుల్లో పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు తగిన వసతులను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9 గంటల నుంచి పరీక్షా కేంద్రానికి అనుమతి ఇస్తామన్నారు. 10 గంటల తర్వాత గేట్ మూసివేస్తామన్నారు. ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు.

బీజేపీ పట్టణ అధ్యక్షుడిపై ఫిర్యాదు

జగిత్యాల టౌన్, జూన్ 8: తన భూమిలో అక్రమంగా హద్దులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నాడని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ జగిత్యాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు రంగు గోపాల్‌పై ఒక వ్యక్తి జగిత్యాల పట్టణ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. పట్టణంలోని గట్ల రాధాకిషన్ అనే వ్యక్తి 2003 సంవత్సరంలో మోతె శివారులో 30 గుంటల భూమిని కొనుగోలు చేసాడు. అయితే రెండు సంవత్సరాలుగా గోపాల్ అనే వ్యక్తి తన భూమి ఆక్రమించేందుకు పాల్పడడంతో పాటు బెదిరింపులకు గురి చేస్తున్నాడని రాధాకిషన్ ఫిర్యాదులో పోలీసులకు వివరించాడు. అంతేకాకుండా తన భూమి హద్దులను దౌర్జన్యంగా తొలగించి అక్రమంగా కొత్త హద్దులను ఏర్పాటు చేశాడని తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు పోలీసులకు తన బాధను వెల్లబోసుకున్నాడు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయంపై హర్షం

జగిత్యాల టౌన్, జూన్ 8: వరంగల్,ఖమ్మం,నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీగా చింతపండు నవీన్ విజయం సాధించడంపై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, ఉద్యోగుల, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి నవీన్ విజయంలో కీలకపాత్ర పోషించారన్నారు. అనంతరం నవీన్‌కు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. 'ఈనాడు' సంస్థల అధినేత రామోజీరావు మృతి పత్రికా రంగానికి తీరని లోటు అని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం



ముస్తాబైన లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం

రాయికల్, జూన్ 8: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర శ్రీ భక్త మార్కండేయ శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయ 10వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 12న బుధవారం పోచమ్మ బోనాలు, 15న శనివారం స్వామివారి అభిషేకం, ధ్వజారోహణం, అగ్ని ప్రతిష్ఠ, 16న ఆదివారం కల్యాణోత్సవం, అన్నదాన కార్యక్రమం, 17న సోమవారం స్వామవారికి అభిషేకం, ఏకాంత సేవ, సాయంత్రం ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. ఆలయాన్ని రంగులు, విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు.

నేడు భూషణరావుపేటలో విద్యుత్ అంతరాయం

కథలాపూర్, జూన్ 8: ఈ నెల 9న మండలంలోని భూషణరావుపేట సబ్‌స్టేషన్ పరిధిలోని టౌన్ ఫీడర్‌లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏఈ జమీల్‌పాషా తెలిపారు. ఉదయం 8.30 నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన మున్నూరు కాపు నాయకులు

జగిత్యాల టౌన్, జూన్ 8: జగిత్యాల జిల్లా మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం నాయకులు శనివారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఆదివారం నిర్వహించనున్న నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు తదితరులు ఉన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న రాయికల్ మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లును ఆయన నివాసంలో ఎమ్మెల్యే కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జగిత్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

త్వరలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌కు మోక్షం

- ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

జగిత్యాల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రపతి ఉత్తర్వుల ద్వారా త్వరలోనే ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్‌కు మోక్షం లభిస్తుందని ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ప్రైవేటు పంక్షన్ హాలులో టీఎస్ పీఆర్‌టీయూ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, బోయినిపల్లి ఆనంద్‌రావుల ఆధ్వర్యంలో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల ప్రతిభ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పదవ తరగతిలో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ, జిల్లా పరిషత్, మైనార్టీ రెసిడెన్షియల్, సోషల్ వెల్ఫేర్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్ పాఠశాలలకు చెందిన 37 మంది విద్యార్థులకు, అదే విధంగా వంద శాతం ఉత్తీర్ణత సాధించిన 101 మంది ప్రధానోపాధ్యాయులకు జిల్లా పీఆర్‌టీయూ శాఖ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి మాట్లాడారు. ఏకీకృత సర్వీసు రూల్స్ అమలయితే విద్యాధికారుల పోస్టులు భర్తీ అయ్యే అవకాశాలున్నాయన్నారు. ప్రభుత్వం త్వరలోనే అన్ని పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించనుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగళి శ్రీపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు, జగిత్యాల జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, బోయినిపల్లి ఆనంద్ రావు, పంచాయతీ రాజ్ మాస పత్రిక సంపాదక వర్గ సభ్యులు జాలి మహేందర్ రెడ్డి, కరీంగనర్ జిల్లా శాఖ అధ్యక్షుడు ముసుకు తిరుపతి రెడ్డి, సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రావు, కిషన్, పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి నరేశ్, కృష్ణమూర్తి, ఎంఈఓలు గాయత్రి, జమున, గంగాధర్, బీమయ్య, నరేశం, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి

ఇద్దరిపై కేసు నమోదు

జగిత్యాలరూరల్, జూన్ 8: జగిత్యాల రూరల్ మండలంలోని వంజరిపల్లి గ్రామానికి చెందిన గడ్డం రాజయ్య ను దూషించిన అదే గ్రామానికి చెందిన బొల్లెమోహన్, బొల్లె మల్లేష్‌లపై కేసు నమోదు చేసినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. వంజరిపల్లి గ్రామంలో శుక్రవారం మహిళ సంఘం లావాదేవీల గురించి గ్రామస్థులు, కులసంఘం సభ్యుల సమక్షంలో పంచాయతీలో గొడవ జరిగింది. ఇట్టి విషయాన్ని దృష్టిలో పెట్టుకొని రాత్రి సమయంలో మోహన్, మల్లేష్ అనే వ్యక్తులు రాజయ్య ఇంటికివెళ్లి తలుపులను కొడుతూ దూషించి బెదిరించారని తెలిపారు. రాజయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

12న నృసింహుడి హుండీ లెక్కింపు

ధర్మపురి, జూన్ 8: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో హుండీ లెక్కింపు ఈ నెల 12న బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందని దేవస్థానం ఈవో సంకటాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, అర్చకులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, భక్తులు సహకరించాలని ఆయన కోరారు.

నేటి గ్రూప్-1 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లాలో 22 పరీక్ష కేంద్రాలు
- గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి
- కలెక్టర్ యాస్మిన్ భాషా

జగిత్యాల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న జరగనున్న గ్రూప్-1 పరీక్షకు కమిషన్ నిబంధనల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి అయ్యాయని జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా తెలిపారు. జిల్లాలో 22 పరీక్ష కేంద్రాల్లో 7,692 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారన్నారు. ఉదయం 9గంటలకు నిశిత పరిశీలన చేస్తూ కేంద్రంలోకి అనుమతిస్తారని, ఉదయం 10గంటలకు మెయిన్ ద్వారం మూసివే యడం జరుగుతుందన్నారు. అనంతరం అభ్యర్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకోవడం జరుగుతుందని, పరీక్షల నిర్వహణకు ఏ ఒక్క పొరపాటుకు తావివ్వకుండా ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్ష నిర్వహణకు 386 మంది ఇన్విజి లేటర్లు, 22 మంది చీఫ్ సూపరిండెంట్లు, 22 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్‌లు, 5గురు ఫ్లైయింగ్ స్క్వాడ్, 77 మంది బయోమెట్రిక్ ఆఫీసర్లు, 4 రూట్ అధికారులు, 119 ఐడెంటిఫికేషన్ అధికారులు, 154 మంది పోలీస్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఆయా ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించామన్నారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా అధికారులు చూడాలన్నారు. పరీక్ష నిర్వహణకు నోడల్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ దివాకరన్, పోలీస్ నోడల్ అధికారిగా అదనపు ఎస్పీ వినోద్‌కుమార్‌లను నియమించామన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

- ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

జగిత్యాల టౌన్ : గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ పేర్కొన్నారు. గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్ష ఏర్పాటు, బందోబస్తు తదితర అంశాలపై శనివారం జిల్లా పోలీస్ అధికారులతో ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రూప్-1 రాత పరీక్షకు సంబంధించి జిల్లాలో 22 పరీక్ష కేంద్రాలు ఉన్నాయన్నారు. పరీక్షక కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, సమీపంలో ఉన్న అన్ని జిరాక్స్ కేంద్రాలు, ఇంటర్ నెట్ సెంటర్స్ మూసివేయాలన్నారు. పరీక్ష కేంద్రాల నుంచి 100 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడి ఉండవద్దన్నారు. 300 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలని మానసికంగా ఎలాంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అభ్యర్థులకు సూచించారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చివరి నిమిషంలో వచ్చి ఇబ్బందులు పడవద్దని సకాలంలో ముందే చేరుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి బ్యాగులు, సెల్ ఫోన్లు, స్మార్ట్‌వాచ్‌లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. నిబంధనలు అనుసరించి పరీక్షలు జరుగుతాయన్నారు.



జగిత్యాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



జగిత్యాలలో పరీక్ష కేంద్రం వద్ద అధికారులు

వాసవీమాతకు 108 రకాల నైవేద్యాలు

మల్లాపూర్, జూన్ 8: మండల కేంద్రం శివారులోని వాసవీమాత ఆలయంలోని అమ్మవారికి 108 రకాల నైవేద్యాలను శనివారం భక్తులు సమర్పించారు. గత పన్నెండు రోజులగా జరుగుతున్న యజ్ఞం కార్యక్రమంలో భాగంగా ఉదయం ఆలయంలోని అమ్మ వారికి ప్రత్యేక పూజలు, భజనలు నిర్వహించారు. అనంతరం భక్తులు తయారు చేసిన 108 రకాల వంటలు, స్వీట్లు, పండ్లు వంటి పదార్థాలను సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం చీలమంతుల చత్రపతి గీతా పరాయణం కార్యక్రమాన్ని నిర్వహించగా మండలంలోని ఆయ గ్రామాల్లోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై భజనా కార్యక్రమాలు చేపట్టారు. వాసవీమాతకు ప్రత్యేకంగా నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నీట్-2024 పరీక్షను తిరిగి నిర్వహించాలి

జగిత్యాల అర్బన్, జూన్ 8: నీట్-2024 పరీక్షను తిరిగి నిర్వహించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష లీకేజీపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో పరీక్ష నిర్వహణ, ఫలితాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, జిల్లా కేంద్రంలోని స్థానిక తహశీల్ చౌరస్తా వద్ద శనివారం స్థానిక వైద్య విద్యార్థులు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీట్ చరిత్రలో ఇద్దరు, ముగ్గురికి మినహా ఆల్ ఇండియా లెవల్ మొదటి స్థాయి ర్యాంకులు రాలేదని, ప్రస్తుత పరీక్షలో ఏకంగా 60మందికిపైగా ఆల్ ఇండియా మొదటి ర్యాంకులు రావడం అనుమానాలకు తావిస్తుందన్నారు. దేశంలోని ఢిల్లీ, హర్యానాలో పేపర్ లీకేజీపై ఆరోపణలు వచ్చాయని, దీనిపై ఎన్టీయే స్పందించకపోవడం విచారకరం అన్నారు. నాలుగైదేళ్ల కోచింగ్ తీసుకునే విద్యార్థులకు సైతం మొదటి ర్యాంకు కష్టతరంగా ఉండే నీట్‌లో అంతమంది విద్యార్థులకు ప్రథమ స్థాయి ర్యాంకులు రావడం అసాధ్యం అన్నారు. నెగిటివ్ మార్కులకు, ఫలితాల్లో వచ్చిన మార్కులకు పొంతన లేకుండా మార్కులు రావడం అనుమానాలకు బలం చేకూర్చేలా ఉందన్నారు. 24లక్షల మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడే విధంగా నేషనల్ టెస్ట్ ఏజెన్సీ(ఎన్టీయే) వ్యవహరించడం విచారకరమని అన్నారు. ఇప్పటికైనా తక్షణమే పేపర్ లీకేజీ ఆరోపణలపై జ్యూడీషియల్ విచారణ జరిపించడంతో పాటు, నీట్ 2024ను పరీక్షను తిరిగి నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యవిద్యార్థులు డాక్టర్ వినూత్న రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, ముద్దం విజయ్, మహేష్ రెడ్డి, బాలాజీ, శివసాయిరెడ్డి, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



జగిత్యాలలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

సైదాపూర్, జూన్ 8: పురుగుల మందు తాగిన సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి గ్రామా నికి చెందిన కస్తూరి బ్రహ్మచారి(75) అనే వృద్ధుడు శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బ్రహ్మచారికి ముగ్గురు కూతు ళ్లు, కుమారుడు ఉన్నారు. ఏడు ఏళ్ల క్రితం కొడుకు చనిపోయాడు. అప్పటినుంచి బ్రహ్మచారి మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపంతో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం పురుగుల మందు తాగాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. బ్రహ్మచారి కూతురు మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు

వ్యవసాయ బావిలో పడి దినసరి కూలీ మృతి

సైదాపూర్, జూన్ 8: మండలంలోని గుజ్జులపల్లి గ్రామ శివారులో వ్యవసాయ బావికి గాజులు పోస్తుండగా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన మెట్ట మొగిళి(45) అనే దినసరి కూలీ ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొగిళి బావికి గాజులు పోసేందుకు రోజు కూలీ పనికి వస్తుండేవాడు. అదే క్రమంలో శనివారం గాజు పోస్తుండగా బావిలో పడిపోయాడు. స్థానికులు, తోటి కూలీలు బావిలో నుంచి మొగిళిని బయటకు తీసి చూడగా మృతి చెందాడు. దీనిపై ఎస్సై జన్ను ఆరోగ్యంను వివరణ కోరగా తమకు సమాచారం లేదని, కుటుంబ సభ్యుల ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని తెలిపారు.

సినిమా వార్తల కోసం www.andhrajyothy.comను క్లిక్ చేయండి

ఇద్దరిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

కొడిమ్యాల, జూన్ 8: మండలంలోని తురుకకాశీనగర్ గ్రామ శివారులోని రైల్వేగేట్ సమీపంలో శుక్రవారం రాత్రి మంగపేటకు చెందిన నల్ల పవన్, నల్ల సాగర్‌లపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి గాయపరిచినట్లు బాధితుడు పవన్ ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ అర్షరాజు తెలిపారు. మంగపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు గంగాధర వైపు నుంచి మంగపేటకు వెళ్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు రాడ్లతో కొట్టగా గాయాలైనట్లు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

సుందిళ్ల బ్యారేజీని సందర్శించిన జస్టిస్ చంద్రఘోష్



బ్యారేజీ పనులను పరిశీలిస్తున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్

మంథనిరూరల్, జూన్ 8: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా పెద్దపల్లి జిల్లా మంథని మండలం సుందిళ్ల వద్ద నిర్మించిన పార్వతి బ్యారేజీని జస్టిస్ పినాకి చంద్రఘోష్ శనివారం సందర్శించారు. అక్కడ జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. గతంలో జరిగిన పనులకు, ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించి ఈనెల 10వ తేదీ వరకు నివేదిక ఇవ్వాలని ఆయన నీటి పారుదల శాఖాధికారులను ఆదేశించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అక్రమాలను గుర్తించేందుకు సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పినాకి చంద్రఘోష్ చైర్మన్‌గా విచారణ కమిషన్‌ను ప్రభుత్వం నియమించింది. శుక్రవారం మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను పరిశీలించిన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ బృం దం శనివారం ఉదయం సుందిళ్ల బ్యారేజీ వద్దకు చేరుకుని పైనుంచి మొత్తం పరిశీలించి కింద పనులు జరుగుతున్న చోటికి వెళ్లి పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న లోపాలను ఇరిగేషన్ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్యారేజీ నిర్మాణ నమూనాలను పరిశీలించారు. నిర్మాణాన్ని అడుగడుగునా క్షుణ్ణంగా పరిశీలించి గతంలో జరిగిన లోపాలు ఉన్న వాటికి, ప్రస్తుతం జరుగుతున్న మరమ్మతు పనులకు సంబంధించి ఈనెల 10వ తేదీ నాటికి నివేదిక సమర్పిం చాలని అధికారులను ఆదేశించారు. బ్యారేజీ సందర్శనకు ముందు రామగిరి మండలం సుందిళ్ల గ్రామంలో ఉన్న అతి ప్రాచీనమైన లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో జస్టిస్ చంద్రఘోష్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంటన ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంట ప్రశాంత్‌జీవన్ నవయుగ డైరెక్టర్ రమేశ్, జీఎం మాధవ్, ఈఎన్‌సీ ఓఅం డ్ఎం నాగేందర్, రామగుండం సీఈ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఈ కరుణాకర్ తదితరులు ఉన్నారు.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, జూన్ 8: ధర్మపురి క్షేత్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో భక్తుల రద్దీ పెరిగింది. సెలవురోజులు కావటం వల్ల శ్రీ లక్ష్మీనరసింహస్వామి, అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం వరకు వరకు క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. నవ దంపతులు గోదావరి పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. అక్కడి నుంచి భక్తులు నేరుగా శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయాలకు చేరుకున్నారు. స్వామి దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్‌లో నిలబడి ఆలయాల్లోకి ప్రవేశించారు. భక్తులు వివిధ రకాల పూజల టిక్కెట్లు కొనుగోలు చేశారు. అభిషేకాది పూజలు, కుంకుమ అర్చనలు, నిత్య కల్యాణం పూజలు చేయించారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. కుబే రుడిని దర్శనం చేసుకున్నారు. అందంగా పూలతో స్వామి వారలను అలంకరణ చేశారు. ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చ కులు నిత్య పూజలు అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు.

మహిళ ఆత్మహత్య



రాజవ్వ(ఫైల్)

కోనరావుపేట, జూన్ 8: కోనరావుపేట మండలం మండలపల్లె గ్రామానికి చెందిన అవురం రాజవ్వ(55) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అవురం రాజవ్వ కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధ పడుతోంది. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చూపించారు. వైద్యుల సూచనల మేరకు ఐదేళ్లుగా మందులు వాడుతోంది. ఆరోగ్యం కుదుటపడకపోవడంతో మనోవేదన గురై శుక్రవారం రాత్రి కుటుంబసభ్యులు నిద్రిస్తున్న సమయంలో ఇంటి ముందు ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

గన్నేరువరం, జూన్ 8: మండలంలోని ఖాసింపేట గ్రామానికి చెందిన జక్కనపెళ్ళి రాయమల్లు(42) అనే వ్యక్తి విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రాయమలు గ్రామంలోని తన సోదరి రామంచ సత్తవ్వ నిర్మిస్తున్న నూతన గృహంలో ఫ్లోరింగ్ పనులను నిర్వహిస్తున్నాడు. ఆ సమయంలో మోటార్ వైర్ పెట్టే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. బంధువులు ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు నగలు కడిగి ఇస్తామని మోసం

- ఇద్దరికి గ్రామస్థుల దేహశుద్ధి

కోనరావుపేట, జూన్ 8: బంగారు ఆభరణాలను కడిగి ఇస్తామని మోసం చేయడానికి ప్రయత్నించిన ఇద్దరిని పట్టుకున్న గ్రామస్థులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. కోనరావుపేట మండలం మలకపేట గ్రామంలోని కట్ల మల్లవ్వ ఇంటికి వెళ్లిన ఇద్దరు బంగారు గొలుసులను కడిగి ఇస్తామని చెప్పారు. దీంతో మల్లవ్వ బంగారు గొలుసును వారికి ఇచ్చింది. వారి వద్ద ఉన్న కెమికల్ పూయడంతో బంగారు గొలుసు నల్లబడింది. మల్లవ్వకు మత్తుమందు పెట్టే ప్రయత్నం చేయగా కేకలు వేసింది. గ్రామస్థులు ఇద్దరిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. గ్రామపంచాయతీ వద్ద బంధించి కోనరావుపేట పోలీసులకు అప్పగించారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

మెట్‌పల్లి రూరల్, జూన్, 8: ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా మం డలంలోని ఆత్మనగర్ గ్రామం నుంచి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు రెవెన్యూ అధికారి ఉమేశ్ తెలిపారు. శనివారం ఆత్మనగర్ గ్రామ శివారులోని వాగు నుంచి అక్రమంగా మెట్‌పల్లికి తరలిస్తున్నట్లు సమాచారం మేరకు పట్టుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న ట్రాక్టర్లను మెట్‌పల్లి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. అదే విధంగా మల్లాపూర్ మండలం నుంచి అక్రమంగా మెట్‌పల్లికి తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మెట్‌పల్లి ఎస్సై చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గ్రామాల్లోని వాగుల నుంచి అక్రమంగా ఇసుక తర లింపు, నిల్వ చేసిన, చెరువల నుంచి మట్టిని తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కనకదుర్గ చిట్ ఫండ్ చైర్మన్ అరెస్టు

కరీంనగర్ క్రైం, జూన్ 8: గడువు ముగిసినప్పటికీ చిట్ డబ్బులు మొత్తం చెల్లించక పోగా, చిట్ సభ్యురాలును బెదిరింపులకు గురిచేసిన కనకదుర్గ చిట్‌ఫండ్స్ చైర్మన్ రాగిడి తిరుపతిరెడ్డి, అతడి అనుచరుడు రాజులపై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామని కరీంనగర్ రెండో టాణా సీఐ విజయకుమార్ తెలిపారు. సీఐ వివరాల ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా గీతానగర్‌కు చెందిన ప్రస్తుతం కరీంనగర్ సుభాష్‌నగర్‌లో నివాసముంటున్న గడ్డం జమున అనే మహిళ కరీంనగర్‌లోని ఐబీ చౌరస్తాలోని కనకదుర్గ ప్రయివేట్ చిట్ ఫండ్‌లో 3 లక్షల రూపాయల చిట్‌లో సభ్యురాలిగా చేరింది. ఆ చిట్‌కి సంబంధించిన పూర్తి మొత్తం చెల్లించింది. గడువు ముగిసిన అనంతరం తనకు రావాల్సిన డబ్బులు అడిగింది. హనుమకొండ జిల్లా గోపాలాపూర్‌కు చెందిన రాగిడి తిరుపతయ్య అలియాస్ తిరుపతిరెడ్డి, అతడి అనుచరుడైన రాజులు రెండు ఖాళీ బ్యాంకు చెక్‌లు అందచేశారు. ఆ ఖాతాల్లో డబ్బులు లేక బ్యాంకుల్లో ఆ చెక్‌లు బౌన్స్ అయ్యాయి. ఈ విషయం బాధితురాలు జమున చిట్ ఫండ్ చైర్మన్ తిరుపతిరెడ్డికి చెప్పగా డబ్బులు ఇవ్వడం కుదరదని చెప్పడమేగాక మరోసారి అడిగితే చంపేస్తామని బెదిరింపులకు గురిచేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ విజయ్ కుమార్ విచారణ అనంతరం చిట్ ఫండ్ చైర్మన్‌రాగిడి తిరుపతిరెడ్డిపై తెలంగాణ ప్రొటెక్షన్ ఆఫ్ డిపాజిటర్స్ ఆఫ్ ఫైనాన్సియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ సెక్షన్ 5 ప్రకారం కేసు నమోదు చేసి కోర్ట్‌లో హాజరు పరిచారు. నిందితుడికి రిమాండ్ విధించగా జైలుకు తరలించామని సీఐ తెలిపారు.

చిన్నారి మృతదేహానికి పోస్టుమార్టం

ఎల్లారెడ్డిపేట, జూన్ 8: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఈ నెల 3న నాలుగు నెలల చిన్నారి బుర్క అన్విశ్రీ జ్వరంతో మృతి చెందింది. తమ కూతురు మరణంపై అనుమానాలున్నాయని పేర్కొంటూ ఈ నెల 8న చిన్నారి తల్లి కైరుబి అలియాస్ ఇషిత స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఖననం చేసిన మృతదేహాన్ని శనివారం బయటకు తీసిన వైద్యాధికారులు పోస్టుమార్టం చేశారు. ఎల్లారెడ్డి పేట మండల కేంద్రానికి చెందిన కైరుబి అదే గ్రామానికి చెందిన బుర్క రాకేశ్‌ను ప్రేమ వివాహం చేసుకున్నారు. రెండో సంతానమైన నాలుగు నెలల అన్విశ్రీకి గత నెల 29న స్థానిక ప్రభుత్వ ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేశారు. అదే రోజు చిన్నారికి జ్వరం వచ్చింది. మందులను వేసినా తగ్గలేదు. ఈ నెల 1న వాంతులు, విరేచనాలు అధికమయ్యాయి. చిన్నారిని తిరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్య సిబ్బంది అందించిన మందులను వాడినా నయం కాలేదు. పరిస్థితి విషమించడంతో ఈ నెల 3న మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు పాప అప్పటికే మృతి చెందిందని వెల్లడించారు. చిన్నారి మృతదేహాన్ని స్థానిక గిద్దె చెరువు సమీపంలోని శ్మశాన వాటికలో ఖననం చేశారు. తమ కూతురు మరణానికి గల కారణాలను తెలుసుకోవాలని, చర్యలు తీసుకోవాలని చిన్నారి తల్లి కైరుబి అలియాస్ ఇషిత పోలీస్ స్టేషన్‌లో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఖననం చేసిన చిన్నారి మృతదేహానికి బయటకు తీసి సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి ప్రత్యేక వైద్యాధికారుల బృందం శ్మశాన వాటికలో పోస్టుమార్టం నిర్వహించింది. ఆర్ఐ సంతోష్ సమక్షంలో పంచనామా నిర్వహించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమాకాంత్ తెలిపారు.

పోలీస్ జాగిలం మృతి



జాగిలంకు నివాళులు అర్పిస్తున్న ఎస్పీ , పోలీసులు

తంగళ్లపల్లి, జూన్ 8: ఎన్నో ఏళ్లుగా పోలీస్ సేవలు అందించిన జాగిలం రాజా అనారోగ్యంతో శనివారం మృతిచెందింది. తంగళ్లపల్లి మండలం తాడూర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించి జాగిలం మృతదేహం వద్ద జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్ పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జాగి లం జిల్లాలో అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గత 14 సంవ్సతరాల నుంచి జిల్లాలో వీవీఐపీ, వీఐపీలు సందర్శించినపుడు స్నీపర్స్, బాంబులు, మందుపాతరలు గుర్తించడంలో చాకచక్యంగా వ్యవహరించి విధులు నిర్వహించిందని కొనియాడారు. 2010 సంవత్సరంలో తన హ్యాండ్లర్ మల్లేశంతో పాటు 8 నెలల పాటు ఐఐటీఏ మొయినాబాద్ నందు బేసిక్ ట్రేయినింగ్ పూర్తి చేసుకొని జిల్లాలో 14 సంవత్సరాలుగా సేవలు అందించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు యాదగిరి, మధుకర్, రమేష్, రాజా హ్యాండ్లర్ మల్లేశం, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో ఇంటికి నిప్పు



మంటలు అంటుకున్న ఇల్లు

తంగళ్లపల్లి, జూన్ 8: మద్యం మత్తులో భార్యతో గొడవపడిన భర్త ఇల్లు తగులబెట్టిన సంఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌లో శనివారం చోటు చేసుకుంది. తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌కు చెందిన ముదారి బాల పోచయ్య మద్యానికి బానిసై నిత్యం భార్యతో గొడవపడేవాడు. శనివారం సాయంత్రం మద్యం తాగి ఇంటికి చేరుకున్న బాలపోచయ్య అతడి భార్య రాజేశ్వరితో గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం తలెత్తింది. మద్యం మత్తులో ఉన్న బాలపోచయ్య కోపోద్రిక్తుడై రాజేశ్వరి ఒంటిపై, అలాగే ఇంట్లో వస్తువులతోపాటు తనపై కిరోసిన్ పోసుకొని నిప్పుపెట్టే ప్రయత్నం చేశాడు. రాజేశ్వరి ఇంటి నుంచి బయటకు పరుగెత్తింది. ఆమె బయటకు వెళ్లడం తో ఆగ్రహంతో బయటికి వచ్చి ఇంటికి నిప్పు పెట్టాడు. మంటలు ఉవ్వెతున ఎగిసిపడడంతో స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బాల పోచయ్యను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

కొండగట్టులో భక్తుల సందడి



ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మల్యాల, జూన్ 8: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిదానం శనివారం భక్తులతో సందడిగా మారింది. పాఠశాలల వేసవి సెలవులు ముగుస్తుండడం, వ్యవసాయ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకుంటున్నారు. ఆలయంలో భక్తులు అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

● జనసేన నాయకుల పూజలు..

ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఎన్నికలలో జనసేన ఘన విజయం సాధించడం, పిఠాపురం నుంచి పవన్‌కల్యాణ్ గెలుపొందడంతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జనసేన పార్టీ నాయకులు కొండగట్టు అంజన్నను దర్శించుకొని పూజలు చేశారు.. అంజన్న ఆశీస్సులతో విజయం సాధించామని తెలిపారు. కార్యక్రమంలో జనార్దన్, ఉదయ్‌కుమార్‌రెడ్డి, అజయ్, రామారావు, గణేశ్, వెంకటేష్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

పాముకాటుతో బాలుడి మృతి

మల్లాపూర్, జూన్ 8: మల్లాపూర్ మండల కేంద్రంలో పాము కాటుతో మోతె జ్ఞానేశ్వర్(15)అనే బాలుడు మృతి చెందినట్లు శనివారం గ్రామస్థులు తెలిపారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం..మోతె జ్ఞానేశ్వర్ చిన్నతనంలో తల్లిదండ్రిని కోల్పోయాడు. ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ట్రస్టులో విద్యనభ్యసిస్తున్నాడు. వేసవి సెలవులు రావడంతో మల్లాపూర్‌లోని అమ్మమ్మ వద్దకు వచ్చాడు. శుక్రవారం ఇంటి ముందు ఆడుకుంటున్న సమయం లో పాము కాటు వేసింది. అలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు ఆసపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు.

పవన్ కల్యాణ్ విజయంపై కొండగట్టులో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు చేసిన అనంతరం జనసేన నాయకులు

కోరుట్ల, జూన్ 8 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ విజయాన్ని స్వాగతిస్తూ శనివారం కోరుట్ల నియోజవర్గ జనసేన నాయకులు ప్రత్యేక పూజల్లో పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. కొండగట్టు పుణ్య క్షేత్రంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రచారం నిమిత్తం వారాహి వాహనానికి పూజలు నిర్వహించి ఇక్కడి నుంచి ప్రారంభించడం శుభపరిణామంగా భావించి నియోజకవర్గ నాయకులు పవన్‌కళ్యాణ్ విజయపతాకం ఎగరవేయాలని నాయకులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు గంగం అజేయ్ కుమార్, మోడ్నాల రామారావు, జగదీశ్వర్, అందె వెంకటేష్, దాసరి గణేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి గంగపుత్రుల క్షీరాభిషేకం



ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న గంగపుత్రులు

కథలాపూర్, జూన్ 8 : ఎన్నో రోజుల కిందట తెగిపోయిన ఊరచెరువు మరమ్మతులకు నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయించిన వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటంకు శనివారం గంగపుత్రులు క్షీరాభిషేకం చేశారు. గండి పడడం వల్ల ఏటా నీరంతా వృథాగా పోవడం వల్ల చేపల పెంపకం లేకుండా పోయిందని పేర్కొన్నారు. 9.26 లక్షలు మంజూరు చేసి కట్ట మరమ్మతులు చేయడం వల్ల నీళ నిలచి మత్స్య సంపదతో పాటు భూగర్భ జలాలు పెరగడానికి ఆస్కారం ఏర్పడిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాయితి నాగరాజు, ఎన్ఎస్‌యూఐ నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకుల సంతోష్, లక్ష్మణ్, మధు, రాజారెడ్డి, శ్రవణ్, ఇస్తారు, జలంధర్ తదితరులు ఉన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

రాయికల్, జూన్ 8: మండలంలోని భూపతిపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర 10వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజేత స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని యువత క్రికెట్ ఆడేందుకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కోల రాజ్ గోపాల్, ప్రతాప్, దేవేందర్, విక్రమ్, రాజ్ శేఖర్, జయంత్, రాంప్రసాద్, జితేందర్, నాగరాజు, సాదిక్, శశాంక్, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

మల్యాల, జూన్ 8: మండలంలోని పోతారంలో ప్రమాదవశత్తూ నిప్పంటుకొని ఎనుగంటి ప్రశాంత్ అనే రైతుకు చెందిన 1500వరి గడ్డి కట్టలు దగ్ధం అయ్యాయి. గడ్డికి నిప్పంటుకోవడంతో స్థానికులు జగిత్యాలలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలంకు వెళ్లి మంటలను ఆర్పివేశారు. ఫైర్ సిబ్బంది మధు, నరేష్, వేణు, శ్రీనివాస్ పాల్గొన్నారు

బడీడు పిల్లను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలి



బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయులు

కొడిమ్యాల, జూన్ 8: మండలంలోని వివిధ గ్రామాల్లో బడిబాట కార్యక్రమాల్లో బాగంగా మూడో రోజు శనివారం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఇంటింటికీ తిరుగుతూ బడి ఈడు పిల్లలను ప్రభుత్వం పాఠశాలలో చేర్చాలని కోరారు. కార్యక్రమాల్లో గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులు, కార్యదర్శులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ టౌన్, జూన్ 8: వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆరుద్ర నక్షత్రం సందర్భంగా రాజన్న ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివారం దేవతార్చనలు నిర్వ హించారు. సాయంత్రం సదస్యం నిర్వహించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

వ్యవసాయ సదస్సు కరపత్రం ఆవిష్కరణ

ఇల్లంతకుంట, జూన్ 8: మండలంలోని పెద్దలింగాపూర్‌లో కొనసాగుతున్న ఉపాధిహామీ పనుల వద్ద వ్యవసాయ కార్మిక సదస్సు కరపత్రాన్ని జిల్లా కార్యదర్శి గన్నారం నర్సయ్య ఆవిష్కరించారు. ఉపాధిహామీ పనులను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి వ్యవసాయ కార్మిక సదస్సును విజయవంతం చేయాలని కోరారు. ఉపాధిహామీ అమలులో ఎదురవుతున్న సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సదస్సును విజయవంతం చేయాలని కోరారు.

మరమ్మతులకు నోచుకోని రహదారులు

ఇబ్బందుల మధ్య ప్రజల ప్రయాణం



మల్లాపూర్, మొగిలిపేట గ్రామాల మధ్య దెబ్బతిన్న రోడ్డు

మల్లాపూర్, జూన్, 8 : గ్రామాల మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడానికి ఏర్పాటు చేసిన లింక్ రోడ్ల పరిస్థితి మండలంలో అధ్వానంగా మారాయి. రోడ్డుపై గుంతలతో రోజూ ఏదో ఒక చోట వాహనాలు ప్రమాదానికి గురై ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. మల్లాపూర్, మొగిలిపేట గ్రామాలకు మధ్య ఉన్న లింకు రహదారి మరమ్మతులకు నోచుకోక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. గత సంవత్సరం కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతింది. కోతకు గురైన, కంకర తేలిన రోడ్డుపై ప్రయాణం చేయడం ప్రమాదకరమని తెలిసినా తప్పని పరిస్థితిలో కొనసాగిస్తున్నారు. మండల కేంద్రమైన మల్లాపూర్‌కు అవసరాలకు ముత్యంపేట, రాఘవపేట, మొగిలిపేట తదితర గ్రామాల వారు వెళ్లడానికి లింక్ రోడ్డు ప్రధానంగా మారింది. గ్రామాల మధ్య ఉన్న రహదారి ఇరుకుగా ఉండడంతో పాటు గుంతలమయమైన రోడ్డుపై ప్రయాణించాలంటే సాహసం చేయాల్సిందే. రాత్రి వేళలో ఈ రోడ్డుపై ఉన్న గుంతలు కనపడక వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఉన్న సింగిల్ రోడ్డు ధ్వంసమై ప్రయాణికులు ఎక్కడో చోట ప్రమాదాలకు గురై ఆసుపత్రుల పాలవుతున్నారు. మరికొన్ని గ్రామాల మధ్య ఉన్న అంతర్గత రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. ఆయా రహదా రులు ఏళ్ల తరబడిగా కనీసం మరమ్మతులకు సైతం నోచుకోక పోవడం తో ప్రయాణం నరకప్రాయంగా మారింది. రోడ్లను బాగు చేయించడం లో సంబంధిత అధికారులకు, ప్రజాప్రతినిధలుకు ఏమాత్రం పట్టింపులేక కొన్నేళ్లుగా గ్రామీణ రోడ్ల నిర్వహణ గాలికొదిలేశారు. వర్షాకాలం సమీపిస్తున్నందున దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



మొగిలిపేట శివారులో ప్రమాదకరంగా మారిన రహదారి

రోడ్లకు మరమ్మతులు లేక ఇబ్బందులు



నిమ్మల నర్సారెడ్డి, బీజేపీ గ్రామశాఖ అధ్యక్షుడు, మొగిలిపేట

దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడంతో ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మల్లాపూర్ మండల కేంద్రం అయినందున లింక్ రోడ్డుపై రాకపోకలు ఎక్కువగా జరుగుతున్నాయి. పూర్తిగా కంకర తేలడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. మధ్యలో వర్షానికి రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి వర్షాలు కురవక ముందే మరమ్మతులు చేపట్టాలి.

సిరిసిల్లలో వర్షం

సిరిసిల్ల, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షానికి జిల్లా కేంద్రంలో పలు చోట్ల రోడ్లపై వరదనీరు ప్రవహించింది. పిడుగుల శబ్దాలు ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. శనివారం సాయంత్రం సిరిసిల్ల, తంగళ్లపల్లి మండలంలో వర్షం కురవడంతో ఎండతో సతమతమవుతున్న ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. తంగళ్లపల్లి మండలం తాడూర్‌లో పశువుల షెడ్డు కూలడంతో కిసాన్ అనే రైతుకు చెందిన రెండు గేదెలు మృతి చెందాయి.

పిడుగు పాటుతో ఆవు మృతి

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్‌కు చెందిన రైతు ఉమ్మారెడ్డి కరుణాకర్‌రెడ్డి చెందిన ఆవు శనివారం పిడుగుపాటుకు మృతిచెందింది. దీంతో సుమారు రూ.80 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

రక్షిత మంచినీటి పథకాలపై గత ప్రభుత్వం నిర్లక్ష్యం

● ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్, జూన్, 8: గత బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ నెపంతో రక్షిత మంచినీటి పథకాలపై నిర్లక్ష్యం చేస్తూ నిలిపి వేసిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. శనివారం మండలంలోని రేచపల్లి గ్రామంలో భవిష్యత్తులో మంచి నీటి సమస్య లేకుండా మంచి నీటి బావికి రూ.9.5 లక్షల నిధులు మంజూరు కాగా నిర్మాణ పనులను స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మిషన్ భగీరథ పథకాన్ని కేసీఆర్ రూ.40 వేల కోట్ల ఖర్చుతో ప్రారంభించినా కనీసం 10శాతం కూడా ప్రజలకు ఉపయోగంలోకి రాలేదన్నారు. 20 కిలోమీటర్ల మేరకు మాత్రమే క్లోరినేషన్ ఉంటుందని సాంకేతికపరంగా అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని కేవలం కాళేశ్వరం, మిషన్ భగీరథ పనులు ప్రచార ఆర్భాటాలు, కమీషన్‌ల కోసమే కేసీఆర్ ప్రారంభించిన పథకాలని వీటిపై న్యాయ విచారణ జరిపిస్తామన్నారు. తుమ్మడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణం చేపట్టేందుకు రూ.5నుంచి 10 వేల కోట్ల వ్యయం అవుతుందని ఈ విషయంపై సంబంధిత మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ఆమోదించేలా ముఖ్యమంత్రితో మాట్లాడుతామన్నారు. తద్వారా 12 మాసాలు గ్రావిటీ ద్వారా నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. జగిత్యాల నియోజకవర్గంలో రక్షిత మంచినీటి పథకాలకు పొలాస, రూ.5.3 లక్షలు, బీర్‌పూర్ రూ.3.7లక్షలు, రాయికల్ రూ.4.97 లక్షలు మొత్తం రూ.13.97 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. భవిష్యత్తులో జగిత్యాల నియోజకవర్గంలో నీటి సమస్య లేకుండా ఈ పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. త్వరలోనే రోళ్లవాగు షటర్ పనులు సైతం ప్రారంభించేలా కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భూక్య సరళ,నాయకులు రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, రవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మంచి నీటి బావిని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలి

ధర్మపురి, జూన్ 8: విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. ధర్మపురి పట్టణంలోని 11వ వార్డు కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ ఆధ్వర్యంలో ఎస్ఎస్‌సీ పరీక్షల్లో 10 జీపీఏ, 9.8 జీపీఏ సాధించిన విద్యార్థులకు శనివారం నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ పట్టణంలోని ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ హైస్కూల్ విద్యార్థులు బొజ్జ తరుణి, చీపిరిశెట్టి రక్షిత, ఎర్రం షైమిత, కాశెట్టి సహర్ష, ఎండీ షరీయా అర్ఫీన్, సంగనభట్ల ప్రతిక్ష, చైతన్య భారతి విద్యానికేతన్, గ్లోబల్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు బుద్దుల సాయి వేదాంత కృతిక, బలిజపెల్లి అక్షితలను ఆయన శాలువా కప్పి, మెమెంటో అందించి ఘనంగా సన్మానం చేశారు. అలాగే 9-8 జీపీఏ సాధించిన స్థానిక జడ్పీహెచ్ఎస్ (బాలికల)లో 9.8 జీపీఏ సాధించిన అంకం సాయి ప్రదీప్తి, అయ్యోరి అమూల్యను సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులను గుర్తించి సన్మాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్ అభినందనీయులని ఆయన కొనియాడారు. విద్యార్థులు మంచి మార్కులు సాధించే దుకు కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయులు, అందుకోసం సహకరించిన తల్లిదండ్రులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ 11 వ వార్డు కౌన్సిలర్ జక్కు పద్మ, బుగ్గారం జడ్పీటీసీ బాదినేని రాజేందర్, వెల్గటూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాటిపర్తి శైలేందర్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, ఆంగ్లోవేదిక్ స్కూల్ ప్రిన్సిపాల్ తోట శంకర్, డైరెక్టర్ గట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్‌ను కొందరు యువకులు కలిసి దొనూర్ గ్రామంలో మైదానాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించారు. జగిత్యాల జిల్లా మున్నూరు కాపు కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ ఆహ్వానించారు.



సన్మానం చేస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్

కార్పొరేట్‌కు వ్యతిరేకంగా పోరాడాలి

వేములవాడ టౌన్, జూన్ 8: కష్టజీవుల రక్తమాంసాలు పీల్చుకుతినే కార్పొరేట్ల తరుపున మతోన్మాద బీజేపీ నిలు స్తోందని, మతోన్మాదానికి, కార్పొరేట్లకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన పార్టీ జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం జెండాను జిల్లా కమిటీ సభ్యుడు ముక్తికాంతం అశోక్ ఆవిష్కరించారు. అనంతరం అబ్బాస్ మాట్లాడుతూ దేశంలో మరోసారి మతోన్మాదులు అధికారంలోకి వచ్చారని, తద్వారా దేశ సమైక్యతకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. ఉత్తర తెలంగాణలో మతోన్మాద శక్తులు గెలిచాయని గ్రామ సీమల్లో పట్టణాల్లో కుల, మత ఘర్షణలను పెంచడం, విద్వేషాలు రెచ్చగొట్టడం ద్వారా రాజకీయ లబ్ధి పొంతుతున్నారని విమర్శిం చారు. ప్రజలు ఆకలి, పేదరికం, నిరుద్యోగం వంటి సమస్యల పరిష్కారం కోసం కుల, మతాలకు అతీతంగా ఐక్యంగా కృషి చేసే పరిస్థితులు ఏర్పడాలని సూచించారు. రైతులకు గిట్టుబాటు ధర, వ్యవసాయ కూలీల కష్టానికి ఫలితం, కార్మికుల కనీస వేతనాలు వంటి సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు.

రాజీ మార్గమే రాజమార్గం

సిరిసిల్ల క్రైం, జూన్ 8: రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత అన్నారు. సిరిసిల్ల జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా మూ డు బెంచ్‌ల ద్వారా 6,788 కేసులు పరిష్కరించినట్లు, రూ.71.56 లక్షల చెల్లింపులు జరిగినట్లు చెప్పారు. ఇందులో పీడీజే, 1వ అడిషనల్ కోర్టులో 4, సీనియర్ సివిల్ కోర్టులో 1, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో 88, 1వ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టులో 146, 2వ అడిషనల్ జూనియర్ సివిల్ కోర్టులో 101, వేములవాడ జూనియర్ సివిల్ కోర్టులో 422, సెకండ్ క్లాస్ కోర్టులో 1430, డీఎల్ఎస్ఏలో బ్యాంకు పీఎల్‌సీలు 2, బీఎస్ఎన్ఎల్ పీఎల్‌సీలు 14, ట్రాఫిక్ పీఎల్‌సీలు 4580 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమమన్నారు. ఉచిత న్యాయసేవలను ఉపయోగించుకోవాలన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన

వెల్గటూర్, జూన్ 8: మండలంలోని కిషన్‌రావుపేటలో తాగునీరు అందించాలని కోరుతూ నేతకాని కాలనీకి చెందిన మహిళలు గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో శనివారం నిరసన తెలిపారు. బోరు బావుల్లో నీరు ఎండి పోవడంతో కొన్ని రోజులుగా ట్యాంక్ నుంచి వస్తున్న నీటినే సరి పెట్టుకుంటున్నామని మహిళలు ఆవేదన చెందారు. గత ఐదు రోజులుగా ఆ నీరు కూడా రాకపోవడంతో తాగు నీటికి ఇబ్బందులు అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి ఎద్దడి గురించి అధికారులకు చెప్పినా ఫలితం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగు నీటి సమస్యను తీర్చాలని లేని పక్షంలో మండల పరిషత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.



పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

కోరుట్ల, జూన్ 8: పట్టణ శివారులోని గుండు వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం స్వామి కల్యాణంను ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో అర్చన అభిషేక కార్యక్రమాలను నిర్వహించిన వేదపండితులు ప్రత్యేక వేదికపై స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అలివేలు మంగ, పద్మావతి, వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరంచి కల్యాణం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఉత్సవ మూర్తులకు పల్లకి సేవను నిర్వహించారు. నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అన్న ప్రసాదం స్వీకరించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, కౌన్సిలర్ ఎంబేరీ నాగభూషణం, నాయకులు సత్యనారాయణ గౌడ్, వాసం అజయ్, చింతకింది శేఖర్, సత్యం అనిల్‌లతో పాటు పలువురు పత్యేక పూజలలో పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు

రామోజీరావుకు ఘన నివాళి

మెట్‌పల్లి, జూన్ 8: 'ఈనాడు' సంస్థల అధినేత రామోజీరావు మృతి పట్ల కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జోతక్క పార్టీ కార్యాలయంలో నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు కొమిరెడ్డి కరంచంద్ ఆదేశాల మేరకు శనివారం పార్టీ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం వ్యక్తం చేశారు. నాయకుల ఎర్రోళ్ల హన్మండ్లు యాదవ్, న్యాయవాది రజక్, యూత్ కాంగ్రెస్ నియోజవర్గం ఉపాధ్యక్షుడు పెంట ప్రణయ్, రెహమాన్, కాసావర్తి వంశీ, నాయిని గంగాధర్, కటకం పాపేష్, పాలేపు కిరణ్, బద్ర సాయికుమార్, ఇరగ దిండ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : 'ఈనాడు' సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావుకు శనివారం మండలంలోని వివిధ గ్రామాలలో ఘన నివాళి అర్పించారు. రామోజీరావు చిత్రపటానికి పూలమాల వేశారు. సినీ, ప్రతికారంగంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. తెలుగు భాషాభివృద్ధికి ఆయన కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలోని వివిధ పార్టీలు, పాత్రికేయుల ఆధ్వర్యంలో 'ఈనాడు' సంస్థల వ్యవస్థాపకుడు రామోజీరావుకు పలువురు శనివారం ఘన నివాళి అర్పించారు. పట్టణంలోని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మానుక ప్రవీణ్ కుమార్, సి. ప్రభాకర్ భవనంలో సిపిఐ, కాంగ్రెస్ ఆధ్వర్యంలో, జువ్వాడి భవనంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులర్పించారు. రామోజీరావు మృతి తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని అన్నారు. సినిమా, పత్రికారంగంలో ఆయన చేసిన సేవలు మరిచిపోలేనివని అన్నారు. ఆయా కార్యక్రమాలలో వివిధ పార్టీల నేతలు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా రగుడు జంక్షన్

● నిలిచిన ఆధునికీకరణ పనులు ● సైడ్‌వాల్స్ లేని బ్రిడ్జిలు ● ఆందోళనలో వాహనదారులు

సిరిసిల్ల రూరల్, జూన్ 8: సిరిసిల్లలోని రగుడు వద్ద ఏర్పాటు చేసిన జంక్షన్ ఆధునికీకరణ పనులు నిలిచిపోవడం, బ్రిడ్జిలకు సైడ్ వాల్‌లు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని విలీన గ్రామం రగుడు జంక్షన్ నుంచి కామారెడ్డి వెళ్లేందుకు ఫోర్‌లైన్ రెండో బైపాస్ రోడ్డును నిర్మించారు. అదే జంక్షన్ నుంచి సిద్దిపేటకు వెళ్లేందుకు సైతం ఫోర్‌లైన్ మొదటి బైపాస్ రోడ్డుతోపాటు సిరిసిల్ల పట్టణానికి వచ్చేందుకు ఫోర్‌లైన్ రోడ్డును నిర్మించారు. ఈ మూడు రహదారులు రగుడు జంక్షన్‌లో కలుస్తుండడంతోపాటు ఆ జంక్షన్‌లో ఉన్న కాలువలపై బ్రిడ్జిలను నిర్మించారు. మూడు రహదారులు ఒకే దగ్గర ఉండడంతో వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు బ్రిడ్జిలకు అడ్డుగా గోడలను ఏర్పాటు చేయకపోవడంతో పాటు జంక్షన్ ఆధునికీకరణ కోసం మున్సిపల్ నుంచి రూ.7 కోట్ల నిధులను మంజూరు చేశారు. ఆ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ జంక్షన్ చుట్టూ భూమిని తవ్వివదిలి వేశాడు. అవి కూడా ప్రమాదాలకు నిలయంగా మారాయి. నిత్యం వాహనాదారులు వేగంగా వచ్చి వాటిల్లో పడిపోతున్నారు. అధికారులు స్పందించడంలేదని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించాలని, ప్రమాదకరంగా ఉన్న జంక్షన్‌ను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు, పట్టణ ప్రజలు కోరుతున్నారు.



సిరిసిల్ల రగుడు జంక్షన్